
## చెత్త బండి.. రోజూ రాదండి..


2





2

## భర్త హత్యకు సుపారీ



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## నవోదయలో ప్రవేశాల కోసం గడువు పొడిగింపు

**అక్షరటుడే, నిజాంసాగర్:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు విధించిన గడువును పొడిగించారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. మొదట ఆరో తరగతి ప్రవేశాల కోసం ఈనెల 29వరకు గతంలో గడువు విధించారు. ఈ గడువును ఆగస్టు 13వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లుగా సీబీఎస్ఈ ప్రకటించింది. దీంతో అర్హత గల ఉమ్మడి నిజామాబాద్ జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మను యోహనన్ కోరారు.



## శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి తగ్గిన ఇన్‌ఫ్లో..



**అక్షరటుడే, ఆర్మూర్:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో తగ్గింది. వరుసగా కురిసిన వర్షాలతో మంగళవారం వరకు జలాశయంలోకి భారీగా వరద వచ్చింది. మంగళవారం ఉదయం 6 గంటలకు వరకు 89,812 క్యూసెక్కుల వరద రాగా.. 9 గంటలకు లక్షా 5వేలకు పెరిగింది. కాగా.. బుధవారం ఉదయం 6 గంటలకు 55,577 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పడిపోయింది. 9 గంటల సమయానికి 15,276 క్యూసెక్కులకు తగ్గిపోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1077.10 (37.632 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది. కాకతీయ ప్రధాన కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 407 క్యూసెక్కులు బయటకు పోతోంది.

## గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

**అక్షరటుడే, భీమ్‌గల్:** వేల్పూర్, ఆర్మూర్ మండలాల్లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో తక్షణ ప్రవేశాలు పొందేందుకు ఆహ్వానం పలుకుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ ఫస్టియర్‌కు గాను ఖాళీ సీట్లను ఈనెల 31లోగా భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పదో తరగతిలో మొదటి ప్రయత్నంలో పాసైన విద్యార్థులు మాత్రమే ఇందుకు అర్హులన్నారు. తక్షణ ప్రవేశాల కోసం విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 31న వేల్పూర్, ఆర్మూర్ కళాశాలల్లో ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదేరోజు ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తామని వివరించారు. పూర్తి వివరాల కోసం కళాశాలలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు..




**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని బోర్లం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ (202526) ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లలో ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. 2025లో 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈనెల 31న (గురువారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ధ్రువపత్రాలతో కళాశాలలో హాజరుకావాలని ఆమె సూచించారు.







**ఆర్టీసీ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలకు ప్రత్యేక టూర్ ప్యాకేజీలను ప్రారంభించింది. సంస్థకు ఆదాయంతో పాటు ప్రయాణికుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక టూర్ ప్యాకేజీల పేరిట అధికారులు బస్సులు నడుపుతున్నారు. కొన్ని ప్రముఖ క్షేత్రాలకు నేరుగా బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. ఆయా ప్రాంతాలకు రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీలు ప్రవేశ పెట్టింది. ఆయా ప్యాకేజీలకు ప్రయాణికుల నుంచి మంచి స్పందన వస్తోంది.** – అక్షరటుడే, బాన్సువాడ

# ఆర్టీసీ టూర్ ప్యాకేజీలకు ఆదరణ

- పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్న సంస్థ
- ఆదాయం పెంచుకునేందుకు చర్యలు
- ప్రయాణికుల నుంచి భారీగా స్పందన

నిజామాబాద్ రీజియన్ పరిధిలో బాన్సువాడ, ఆర్మూర్, కామారెడ్డి, బోధన్ డిపోలు ఉన్నాయి. ఆయా డిపోల నుంచి పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలకు ప్రత్యేక టూర్ బస్సులు నడుస్తున్నాయి. ఒకే రోజు నాలుగు పుణ్యక్షేత్రాలను దర్శించుకునే వీలు కల్పిస్తోంది. అది కూడా కేవలం రూ.వెయ్యి నుంచి ప్రారంభమయ్యే టికెట్ ధరలతో ఈ ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్ వాహనాలపై ఆధారపడకుండా, సురక్షితంగా, సౌకర్యవంతంగా తీర్థయాత్రలకు వెళ్లేలా ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ప్యాకేజీల కోసం సంస్థ అధికారిక వెబ్ సైట్ tsrtconline.in లో రిజర్వేషన్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఆయా టూర్ ప్యాకేజీల్లో భాగంగా టికెట్ రేట్లు చెల్లిస్తే ఎంపిక చేసిన ఆలయాలు, ప్రదేశాలకు తీసుకు వెళ్తారు.

### ఆర్మూర్ పట్టణం నుంచి..

- యాదగిరిగుట్ట, స్వర్ణగిరి యాత్రకు ఒక్కొక్కరికి రూ.1,500.
- వరంగల్ వేయి స్తంభాల గుడి, మేడారం, రామప్ప గుడికి రూ.1,100.
- పండరీపూర్, తుల్జాపూర్, సోలాపూర్ టూర్‌కి రూ. 2,400.
- అరుణాచలం గిరి ప్రదక్షిణ, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం, జోగులాంబ శక్తిపీఠం సందర్శనకు రూ. 5,100.

### బాన్సువాడ నుంచి..

- బాన్సువాడ నుంచి యాదగిరిగుట్ట, స్వర్ణగిరికి టూర్ ప్యాకేజీ అందుబాటులో ఉంది. డీలక్స్ బస్సులో టికెట్ ధర రూ.వెయ్యిగా నిర్ణయించారు.
- బాన్సువాడ నుంచి వరంగల్ రామప్ప ఆలయం, లక్నవరం లేక్ వ్యూ, భద్రకాళి ఆలయానికి మరో ప్యాకేజీ ఉంది. డీలక్స్ బస్సుల్లో ఒక్కొక్కరు రూ.1,500 చెల్లించాలి.
- జరాసంగం మహాదేవుని ఆలయం, బీదర్ నరసింహస్వామి ఆలయం, గానుగాపూర్ దత్తాత్రేయ ఆలయం దర్శనానికి బస్సులు నడుపుతున్నారు. ఈ ప్యాకేజీలో భాగంగా టికెట్ ధర రూ.1,300గా నిర్ణయించారు.
- హైదరాబాద్ బిర్లా టెంపుల్, సాలార్‌జంగ్ మ్యూజియం, ముచ్చింతల్ టూర్‌కు రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.
- బాన్సువాడ నుంచి పర్లి వైజనాథ్, అంబాజోగాయ్, పండరీపూర్ విఠలేశ్వరాలయం, తుల్జాపూర్, సోలాపూర్‌కు వెళ్లొచ్చు. ప్యాకేజీలో భాగంగా టికెట్ ధర రూ.2200 చెల్లిస్తే సూపర్ లగ్జరీ బస్సులో తీసుకు వెళ్తారు.

### కామారెడ్డి బస్టాండ్ నుంచి..

- వరంగల్ వేయి స్తంభాల గుడి, భద్రకాళి దే వాలయం, రామప్ప ఆలయాలకు రూ.వెయ్యి.
- తుల్జాపూర్, పండరీపూర్, అంబా జోగై, పర్లి వైజనాథ్, ఔంద నాగనాథ్, మహూర్ ప్యాకేజీ కోసం టికెట్ ధర రూ.3,200.
- కొమురవెల్లి మల్లన్న ఆలయం, వరంగల్, చిలుకూరు బాలాజీ ఆలయం, రామగుండం, అనంతగిరి, కోటిపల్లి ప్రాంతాల సందర్శనకు కామారెడ్డి నుంచి ప్యాకేజీ అందుబాటులో ఉంది. దీని కోసం రూ. 1500 చెల్లించాలి.
- బద్రీనాథ్ దేవస్థానం (మేడ్చల్ ), బిర్లా టెంపుల్, సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, జూ పార్క్, ట్యాంక్ బండ్ సందర్శన కోసం రూ.వెయ్యి టికెట్‌గా నిర్ణయించారు.
- మేడారం, రామప్ప గుడి, వరంగల్ కోట, భద్రకాళి గుడి, వేయి స్తంభాల గుడి సందర్శనకు రూ.1,100 టికెట్.
- వరంగల్, కొమురవెల్లి, యాదగిరిగుట్ట, రమణేశ్వరం, స్వర్ణగిరి ఆలయాల ప్యాకేజీ టికెట్ ధర రూ. 1500.
- వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, గూడెం గుట్టకు రూ. 1500.
- ఆగస్టు 8న సాయంత్రం 6 గంటలకు కామారెడ్డి నుంచి కానిపాకం, గోల్డెన్ టెంపుల్ (వేలూర్), అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రకు బస్సు బయలు దేరనుంది. ఈ ప్యాకేజీలో భాగంగా టికెట్ ధర ఒక్కొక్కరికి రూ.5 వేలు.

### మరిన్ని టూర్‌లు నడపాలి



ఆర్టీసీ ప్యాకేజీలో భాగంగా నేను ముచ్చింతల్, బిర్లా మందిర్, సాలర్‌జంగ్ మ్యూజియం టూర్‌కు వెళ్లాను. అందరితో కలిసి వెళ్లడం చాలా ఆనందంగా ఉంది. టూర్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగలేవు. ఆర్టీసీ మరిన్ని టూర్ ప్యాకేజీలు కల్పించాలి.

– ఊర్మిళ, బాన్సువాడ


### కొత్త అనుభూతి



యాదగిరిగుట్ట, స్వర్ణగిరికి వెళ్లాను. కొత్త వారితో కలిసి వెళ్లడం కొత్త అనుభూతిని ఇచ్చింది. మరిన్ని తీర్థయాత్రలకు ఆర్టీసీ సౌకర్యం కల్పించాలి.

– శోభ, బాన్సువాడ

### ఆదరణ బాగుంది



తీర్థయాత్రల టూర్ ప్యాకేజీలకు మంచి ఆదరణ లభిస్తుంది. మరిన్ని ప్రాంతాలకు బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా ప్యాకేజీల్లో సౌకర్యాలు కల్పిస్తున్నాం.


– సరితా దేవి, డిపో మేనేజర్, బాన్సువాడ

## ట్రాఫిక్‌లో ఇద్దరు సిబ్బందిపై బదిలీ వేటు..

### హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్.. నెక్స్ట్ ఎవరు..!

**అక్షరటుడే, నిజామాబాద్ :** నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఇద్దరు సిబ్బందిపై బదిలీ వేటు పడింది. ఓ కానిస్టేబుల్, మరో హోంగార్డును హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ సీపీ సాయి చైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. జనరల్ డ్యూటీ విధులు నిర్వహిస్తున్న ఫయాజ్, ట్రాఫిక్ సీఐకు డ్రైవర్‌గా పని చేస్తున్న హోంగార్డు షాకీర్ హెడ్ క్వార్టర్‌కు అటాచ్ అయిన వారిలో ఉన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఇద్దరు సిబ్బందిని హెడ్ క్వార్టర్ కు అటాచ్ చేయడం తీవ్ర చర్చకు దారితీసింది. ప్రత్యేకించి ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. డ్రంకన్ డ్రైవ్ కేసు, వాహనాల తనిఖీ సమయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు కొద్ది నెలలుగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వ్యాపార, వాణిజ్య సముదాయాల యజమానుల నుంచి నెలనెలా ముక్కుపిండి మరి మాముళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. అయితే అధికారుల అండదండలు లేకుండా సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలోనే ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో వచ్చిన వసూళ్ల ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపించారు. తాజాగా కానిస్టేబుల్, హోంగార్డును అటాచ్ చేశారు. ట్రాఫిక్ విభాగంలో ఆరోపణలపై సీపీ సాయి చైతన్య దృష్టి సారించారు. ప్రాథమికంగా ఇద్దరు సిబ్బందిని ఆ విభాగం నుంచి తప్పించారు. తదుపరిగా అధికారులపై చర్యలు ఉండవచ్చనే ప్రచారం జరుగుతోంది. ఇన్‌ఫోర్స్‌మెంట్ పక్కాగా జరిపి ట్రాఫిక్ కష్టాలను తీర్చాల్సిన అధికారులు.. ఏకంగా తమ ఆదాయ మార్గాలను సమకూర్చుకునే పనిలో పడడం పట్ల నగరవాసులు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదే సమయంలో తమకు మామూళ్లు ఇచ్చే బడా వ్యాపారుల జోలికి వెళ్లట్లేదని.. పార్కింగ్ సదుపాయం లేదంటూ చిరు వ్యాపారులపైనే ప్రతాపాన్ని చూపిస్తున్నారని చర్చించుకుంటున్నారు.

## తులం బంగారం పథకాన్ని వెంటనే అమలు చేయాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో వచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేల్పూర్‌లోని తన కార్యాలయంలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులపై సంతకాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొత్తగా వివాహాలు జరిగిన వారికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో భాగంగా అదనంగా ఇస్తామన్న తులం బంగారం పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భీమ్‌గల్‌లో 136, మెండోరా 46, మోర్తాడ్ 27 ఇలా మొత్తం 244 దరఖాస్తులు వచ్చాయన్నారు. కొత్తగా చెక్కులు మంజూరయ్యే లబ్ధిదారులకు రూ. లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులపై ఎప్పటికప్పుడు సంతకాలు చేసి ప్రభుత్వానికి పంపుతున్నామని పేర్కొన్నారు.

## మధ్యాహ్న భోజనం నిధులు విడుదల

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన కుకింగ్ కాస్ట్, సీసీహెచ్‌ల గౌరవ వేతనం విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. 2025-26కు సంబంధించిన పెండింగ్, రెగ్యులర్ బిల్లుల కోసం నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. జూన్ నెల వరకు సంబంధించి ఒకటి నుండి ఎనిమిదో తరగతి విద్యార్థులకు వంట ఖర్చులు, వంట సహాయకుల గౌరవ వేతనం కోసం నిధుల మొత్తాన్ని విడుదల చేసినట్లు తెలిపారు. ఇందులో కుకింగ్ కాస్ట్‌కు గాను రూ.2.17 కోట్లు, అలాగే కుక్ కం హెల్పర్‌ల గౌరవ వేతనం రూ.48.74 లక్షలు విడుదలయ్యాయని ఆయన పేర్కొన్నారు. నిధులను ఎంఈవో ఎస్ఎన్ఏ అకౌంట్లలో జమ చేసినట్లు తెలిపారు.

## ఇంటర్ విద్యార్థులకు బయోమెట్రిక్ అటెండెన్స్



**అక్షరటుడే, ఇందూరు:** ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బయో మెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయనున్నట్లు డీఐఈవో రవికుమార్ తెలిపారు. బుధవారం డీఐఈవో కార్యాలయంలో జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయడానికి విద్యార్థుల బయోడేటా ఆధార్ ఇంటర్ బోర్డు లాగిన్‌ను నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. అపార్ గుర్తింపు లేనివారికి వెంటనే నెంబర్ కేటాయించాలని సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల సమయపాలన పాటించేలా ప్రిన్సిపాళ్లు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.

## మద్నూర్‌లో కలెక్టర్ సుడిగాలి పర్యటన


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**అక్షరటుడే, నిజాంసాగర్:** మద్నూర్ మండలంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి ఆయన ముందుగా మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులతో మాట్లాడారు. అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ఆస్పత్రిలో సమస్యలపై తక్షణమే చర్యలను తీసుకోవాలని ఆస్పత్రి పర్యవేక్షణ అధికారి ఆనంద్ జాదవ్ ఆదేశించారు. మండలంలోని హండేకేలూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పెద్ద ఎక్లార గేట్ వద్ద సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గురుకుల హాస్టల్ విద్యార్థులకు నీటిసమస్య ఉండడంతో వెంటనే బోర్‌వెల్ నిమిత్తం కలెక్టర్ రూ. లక్షను మంజూరు చేశారు. వన మహోత్సవంలో భాగంగా హాస్టల్‌లో అటవీశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలను నాటారు. వారి వెంట డీపీవో మురళి, మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్, డివిజనల్ పంచాయతీ అధికారి సత్యనారాయణ, హౌసింగ్ డీఈ గోపాల్, తహశీల్దార్ ఎండీ ముజీబ్ ఉన్నారు.

## రేపు జూడో సబ్ జూనియర్ ఎంపికలు

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్, క్యాడెట్ విభాగంలో ఈ నెల 31న జిల్లాస్థాయి బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సెక్రెటరీ అభినవ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోని డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 10 గంటలకు ఎంపికలు ఉంటాయన్నారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు. సబ్ జూనియర్ విభాగంలో పాల్గొనేవారు 2011 నుంచి 2013 వరకు జన్మించినవారు అర్హులన్నారు. క్యాడెట్ విభాగంలో 2008, 2009, 2010లో జన్మించినవారు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 5, 6 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని ముచ్కూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి (పెద్దమ్మ గుడి) సంఘ సభ్యులు బుధవారం భూమిపూజ చేశారు. ముదిరాజ్ భవన నిర్మాణానికి రూ.5లక్షల నిధులు మంజూరు కాగా.. పనులు ప్రారంభించారు. పెద్దమ్మ గుడి దగ్గర భవన నిర్మాణం అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ముదిరాజ్ కులస్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘ ప్రతినిధులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## పెద్దమ్మ ఆలయాన్ని కూల్చడాన్ని ఖండిస్తున్నాం..



**అక్షరటుడే, లింగంపేట:** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కారు హిందువులపై పక్షవాత ధోరణితో వ్యవహరిస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బొల్లారం క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. బఫర్‌జోన్‌లో ఉందని ఆరోపిస్తూ జూబ్లిహిల్స్‌లో పెద్దమ్మ ఆలయాన్ని అక్రమంగా కూల్చేశారని పేర్కొన్నారు. మరి బఫర్ జోన్‌లో ఉన్న ఎంఐఎం అధినేత అసదుద్దీన్ కాలేజీని ఎందుకు కూల్చడం లేదని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో పెద్దమ్మ ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలని.. లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మురళి, దత్తురాం, రాంచందర్, విష్ణువర్ధన్, సుభాష్, రజనీకాంత్, అల్లూరి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన రేషన్ కార్డుల పంపిణీ



**అక్షరటుడే, లింగంపేట:** నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామంలో రేషన్ లబ్ధిదారులకు బుధవారం కొత్త కార్డులను కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు సహకారంతో గ్రామానికి 73 నూతన రేషన్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. రేషన్ కార్డుల లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్య క్షుడు కిరణ్ కుమార్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలో చెత్త సేకరణ ప్రక్రియ పూర్తిస్థాయి జరగడంలేదు. పలు కాలనీల్లో నిత్యం చెత్త సేకరణ వాహనాలు తిరుగుతున్నా.. మరికొన్ని చోట్ల రెండు రోజుల కొకసారి కూడా రావడంలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లోనే చెత్త పేరుకుపోతుండడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాలు వచ్చే అవకాశం ఉందని వాపోతున్నారు.

–అక్షరటుడే, ఇందూరు



# చెత్త బండి.. రోజూ రాదండి..

▸ ఇళ్లలో పేరుకుపోతున్న వ్యర్థాలు ▸ వర్షా కాలంలో ప్రజారోగ్యంపై ప్రభావం

నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో రెండు లక్షలకు పైగా కుటుంబాలు నివసిస్తాయి. అయితే పలు ప్రాంతాల్లో చెత్త సేకరణ గాడితప్పింది. కాలనీల ప్రజలు చెత్త బండి కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్నారు. కొన్ని చోట్ల రెం డు మూడు రోజులకోసారైనా రావడంలేదని వాపోతున్నారు. మరోవైపు చెత్త బ యట వేస్తే జరిమానా విధిస్తామని కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. దీంతో ఏమీ చేయలేక ఇంట్లోనే చెత్తను ఉంచాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

### మొత్తం 156 వాహనాలు..

నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. ఇందులో 90 శాతం ఇళ్లలో చెత్త సేకరణ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే 60శాతం కూడా జరగడం లేదని తెలిసింది. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 156 చెత్త సేకరణ వాహనాలు (ఆటోలు) ఉన్నాయి. ఇందులో 131 రెగ్యులర్ ఆటోలు, 25 ఓనర్ కం డ్రైవర్ (ఓసీడీ) ఆటోలు ఉ న్నాయి. చాలా డివిజన్లలో ఓసీడీ ఆటోలు రోజు విడిచి రోజు, కొన్ని కాలనీలోనైతే రెండు రోజులకోసారి చెత్త సేకరిస్తున్నట్లు తెలిసింది.

### రెగ్యులర్‌గా చెత్త సేకరణ

నిజామాబాద్ పరిధిలో చెత్త సేకరణ నిత్యం కొనసాగిస్తున్నాం. ఎక్కడైనా ఫిర్యాదులు అందితే వెంటనే స్పందించి సమస్య పరిష్కరిస్తున్నాం. కొన్ని డివిజన్లలో ఓసీడీ ఆటోలు రోజు విడిచి మరొక రోజు వెళ్తున్నాయి. అక్కడ కూడా రెగ్యులర్ గా వెళ్లేలా చూస్తాం.

– **సోలమన్ రాజు,**
**నగర పాలక సంస్థ, వెహికల్స్ ఇన్‌ఛార్జి**

### వర్షా కాలం ఇబ్బందులు..

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రధానంగా రోజుల తరబడి ఇంట్లో చెత్త పేరుకుపోతే దోమల బెడద ఎక్కువవుతుంది. దీంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఒకవైపు ఆరోగ్యశాఖ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచిస్తుంది. అంటే చెత్తా చెదారం, వ్యర్థాలు, నిల్వ నీరు లేకుండా చూడాలి. కానీ చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో కొందరికి సమస్యలు తెచ్చిపెడుతోంది.

## పైడి ఎల్లారెడ్డి దిష్టిబొమ్మ దహనం



**అక్షరటుడే, గాంధారి:** మండలకేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో గిరిజన జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. కాయితి లాబానాలను ఎస్టీ జాబితాలో కలపాలని యత్నిస్తున్న పైడి ఎల్లారెడ్డి చిల్లర రాజకీయాలు మానుకోవాలన్నారు. బీసీ, ఎస్టీల మధ్య చిచ్చు పెట్టేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఇకనైనా ఆ ప్రయత్నం మానుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మోజిరాం, ప్రేమ్‌దాస్, దేవిసింగ్, సురేందర్, బలరాం, సాయిరాం, ఇందల్, రవి, శీను, తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పాం సాగుపై అవగాహన



**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం మండలంలోని ఖరేగావ్‌లో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు ఆయిల్‌పాం సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి సుమన్ మాట్లాడుతూ.. రైతులు పంట మార్పిడి వైపు దృష్టి పెట్టాలని, లాభదాయకమైన ఆయిల్‌పాం సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఎకరానికి 50 మొక్కలు, అంతర పంట సాగు చేసే రైతు లకు ఎకరానికి రూ.4200 చొప్పున నాలుగేళ్ల పాటు అందిస్తుందన్నారు. అలాగే డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై 90శాతం రాయితీ, సమీకృత అభివృద్ధి మిషన్ కింద పండ్ల తోటలు సాగు చేసే రైతు లకు రెండేళ్ల నిర్వహణ ఖర్చులు ఇస్తామన్నారు. మల్చింగ్ విధానంలో కూరగాయల రైతులకు 50శాతం రాయితీ, ఉల్లి సాగు చేసే రైతులకు కూడా మెయింటైనెన్స్ ఇవ్వనున్నట్లు పేర్కొ న్నారు. కార్యక్రమంలో ఆయిల్ పాం మేనేజర్ మోహన్, ఫీల్డ్ ఆఫీసర్ హమీద్, వికాస్ పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ అన్నారు. బుధవారం పట్టణంలో సీపీఐ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దుబాస్ రాములు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల మహాసభ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, వీటికి వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పని గంటలు పెంచుతూ జీవో తేవడం విచారకరమని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలు ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ఆ ప్రభుత్వాన్ని ప్రజలు మట్టి కరిపించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అలాగే వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో శంకర్, అశోక్ గౌడ్, టి.శ్రీనివాస్, సర్దార్, శివాజీ, రాజు, భూమయ్య, సాయిలు, హన్మాండ్లు, అంజయ్య, సుశీల, గంగామణి, రజియా బేగం పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖాధికారుల పొలం బాట



**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని లోలం గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు బుధవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు విద్యుత్ సంబంధ ఇబ్బందులు లేకుండా, నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. అలాగే విద్యుత్‌కు సంబంధించి పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు ఎలాంటి సమస్య ఉన్నా.. 1912 నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని ఏఈ సూచించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి పల్లి ఏఈ జ్ఞానేశ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో విద్యార్థి ఎన్నికలు



**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో బుధవారం విద్యార్థి ఎన్నికలు నిర్వహించారు. కళాశాల కెప్టెన్, వైస్ కెప్టెన్, సెక్రెటరీతోపాటు ఇతర విధుల నిర్వహణ నిమిత్తం అభ్యర్థులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా అధ్యాపకులు వ్యవహరించగా, విద్యార్థులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రిక తెలిపారు.

## హైమాస్ట్‌లైట్లను ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్



**అక్షరటుడే గాంధారి:** మండలంలోని గండివేట్ గ్రామంలో హైమాస్ట్ లైట్లను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పరమేశ్వర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రూ.2లక్షల నిధులు విడుదల చేయించగా.. హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు సాయిబాబా, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్, కాశీరాం, యాసిక్, సాగర్, చిన్న కాశీరాం, ప్రకాశ్ రాం, చాకలి సాయిలు, మంగలి గంగారం, జీపీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తహశీల్దార్‌కు సన్మానం



**అక్షరటుడే, బాన్సువాడ:** ఇటీవల బదిలీపై వచ్చిన బీర్కూర్ తహశీల్దార్ భుజంగరావును బుధవారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో బీర్కూర్ బీజేపీ మండల అధ్యక్షుడు నాగేళ్ల సాయికిరణ్, ప్రధాన కార్యదర్శులు యోగేశ్వర్, బొంతల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బస్వరాజ్, రాము, సీనియర్ నాయకులు పోచుగోండ, పండరి, సాయిబాబా, ప్రవీణ్, సహదేవ్ పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం మండలకేంద్రంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. క్లబ్ డైరెక్టర్ బాబురావు పుట్టినరోజు సందర్భంగా స్థానిక అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి బాలు, సభ్యులు నారాయణ రెడ్డి, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ డైరెక్టర్ జన్మదిన వేడుకలు



**అక్షరటుడే, బాన్సువాడ:** లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదిన వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ బాన్సువాడ ఆధ్వర్యంలో పట్టణంలోని రామాలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బెజుగం వెంకటరమణ మాట్లాడుతూ.. బాబురావు జన్మదినం సందర్భంగా 200 మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఏ ఖలీద్, విశ్వేశ్వర్, లక్మారెడ్డి, అంజిరెడ్డి, కాచం శ్రీనివాస్, సిద్ధి ప్రకాశ్, నక్క ప్రవీణ్, మురళి పంతులు, తదితరులు పాల్గొన్నారు.

## భర్త హత్యకు సుపారీ.. కటకటాలపాలైన భార్య..

**అక్షరటుడే, లింగంపేట:** అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను హత్య చేయడానికి సుపారీ ఇచ్చింది ఓ భార్య. చివరికి గాయాలతో భర్త ప్రాణాలు దక్కించుకోగా.. భార్య సహా ప్రియుడు, మరో ముగ్గురు కటకటాల పాలయ్యారు. అరెస్టయిన వారిలో ఓ మైనర్ కూడా ఉన్నాడు. హత్యాయత్నానికి సంబంధించిన వివరాలను మంగళవారం ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపేట మండలం చిన్న ఆత్మకూరు గ్రామానికి చెందిన ఆశా వర్కర్ సంపూర్ణకు అదే గ్రామానికి చెందిన జాన్సన్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం ఏర్పడింది. తన సంబంధానికి భర్త రవి అడ్డుగా ఉన్నాడని, అతడిని అడ్డు తొలగించుకునేందుకు ప్రియుడితో కలిసి భర్త హత్యకు కుట్ర చేసింది. ఈ క్రమంలో ప్రియుడు జాన్సన్‌కు భర్త పాస్‌పోర్ట్ సైజు ఫొటో ఇచ్చి హత్య చేసిన వారికి రూ.లక్ష నగదు సుపారీ ఇవ్వాలని సూచించింది. దాంతో జాన్సన్ తన స్నేహితులైన తాండూరు గ్రామానికి చెందిన చాకలి రాజు, చిన్న ఆత్మకూరు గ్రామానికి చెందిన నవీన్‌తో పాటు మరో 17 ఏళ్ల మైనర్ బాలుడిని హత్య చేయడానికి ఒప్పించాడు. పథకం ప్రకారం సంపూర్ణ భర్త రవికి డబ్బు అప్పుగా ఇస్తామని ఆశ చూపిన జాన్సన్ అతడిని ఈనెల 24న పెద్దారెడ్డి గ్రామ డంప్ యార్డు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తున్న సమయంలో రాజు అనే వ్యక్తి రవి తలపై సుత్తితో బాదాడు. దీంతో రవి వారినుంచి తప్పించుకుని ఆత్మకూరు గేటు సమీపంలోని ఓ




ఫామ్ హౌస్ వైపు పారిపోయాడు. జాన్సన్ అతడిని వెంబడించి మరోసారి దాడికి పాల్పడ్డాడు. అయినా తప్పించుకుని రవి ఫామ్ హౌస్ లోపలికి పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి హత్యకు కారణమైన భార్యతో సహా ప్రియుడు మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన సుత్తి, రక్తపు మరకలు ఉన్న దుస్తులు, ముగ్గురు మొబైల్స్, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సదాశివనగర్ సీఐ సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వయ్యారి భామ మొక్కలు తొలగించరూ..!

**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండలకేంద్రంలోని పలు కాలనీల్లో పెరిగిన వయ్యారి భామ మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. శరీరంపై దద్దుర్లు, దురద వంటి ఎలర్జీ లక్షణాలకు గురిచేసే వయ్యారి భామ మొక్కలతో ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన వీటితో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. ఈ మొక్కలతో మనుషులకు చర్మవ్యాధులు, శ్వాసకోశ, సమస్యలతోపాటు పంటలకు, పశువులకు నష్టం వాటిల్లుతుందని అంటున్నారు. సంబంధిత అధికారులు వీటిని పూర్తిగా నిర్మూలించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

